తుఫాన్ షెల్టర్లు శిథిలం

- మూడు గ్రామాల్లో రూ.4.5 కోట్లతో 3 భవనాల నిర్మాణం
- నిర్వహణ లేక ఆకతాయిలకు నిలయం



ముత్యాలమ్మపాలెంలో నిర్మించిన తుఫాన్ షెల్టర్ భవనం

పరవాడ : తుఫాన్లు, ఇతర అత్యవసర సమయాల్లో లోతట్టు, తీర ప్రాంత ప్రజల రక్షణార్థం కేంద్ర ప్రభుత్వ నిధులతో రూ.4.5 కోట్ల వ్యయంతో నిర్మించిన భవనాలు నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. తీర ప్రాంత మత్స్య కార్మికుల సౌకర్యార్థం ముత్యాలమ్మపాలెం, జాలారిపేట, తిక్కవానిపాలెం గ్రామాల్లో తుఫాను షెల్టర్లు నిర్మించారు. ఈ భవనాల నిర్వహణను ప్రభుత్వాలు, స్థానిక గ్రామ పంచాయతీలు పట్టించుకోవడం మానేశాయి. తుఫాను సమయంలో రక్షణ కోసం ఆయా భవనాల్లోకి చేరిన బాధితుల కోసం అన్ని సౌకర్యాలతో నిర్మించిన వీటిని నిర్లక్ష్యంగా వదిలేశారు. ప్రస్తుతం ఈ భవనాలను ఆకతాయిలు పేకాట శిబిరాలకు, అసాంఘిక కార్యకలాపాలకు వినియోగించుకొంటున్నారు.

- ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, జాలారిపేట గ్రామాల్లో 2017లో జాతీయ తుఫాను విపత్తు నివారణ పథకం కింద ఒక్కొక్కటి రూ.1.5 కోట్లతో మూడు గ్రామాల్లో మూడు తుఫాను రక్షిత భవనాలు నిర్మించారు.
- ముత్యాలమ్మపాలెం భవవాన్ని నిర్మించి ఏళ్లు గడుస్తున్నా నిర్వహణను గాలికొదిలేయడంతో ఆకతాయిలు దుర్వినియోగం చేస్తున్నారు. భవనంలో ఏర్పాటు చేసిన ద్వారబందాలు, కిటికీ అద్దాలు, గ్రిల్స్, టెలిఫోన్ వ్యవస్థలను నాశనం చేశారు. భవనం చుట్టూ రక్షణ గోడ లేక మరింత పాడైంది.
- జాలారిపేటలో నిర్మించిన తుఫాను షెల్టరు భవనం చుట్టూ తుప్పలు దట్టంగా పెరిగిపోవడంతో విష సర్పాలు, జంతువులకు ఆవాసంగా మారింది. భవనంలో గచ్చులు పాడైపోయాయి. కరెంటు చార్జీలు చెల్లించకపోవడంతో విద్యుత్ శాఖ అధికారులు లైన్లను కట్ చేశారు. మరమ్మతులకు నోచుకోక తాగునీటి బోరు పనిచేయడం లేదు. ఈ భవనానికి స్వల్ప మరమ్మతులు చేస్తే ప్రభుత్వ కార్యకలాపాలకు వినియోగించుకోనే అవకాశాలున్నాయి. అత్యవసర సమయంలో స్థానికులకూ ఉపయోగించుకునే అవకాశం వుంది.
- తిక్కవానిపాలెం తుఫాను షెల్టరు భవనాన్ని ఆకతాయిలు పేకాట శిబిరంగా మార్చేశారు. భవనం చుట్టూ పేకముక్కలే దర్శనమిస్తున్నాయి. భవనానికి ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు పాడైపోయాయి. తాగునీటి వ్యవస్థ మరమ్మతుల కోసం ఎదురు చూస్తోంది. ఈ భవనానికి స్వల్ప రిపేర్లు నిర్వహిస్తే వివాహాది శుభ కార్యక్రమాలకు వినియోగించుకోవచ్చని స్థానికులు అంటున్నారు. భవిష్యత్‌లో తుఫాన్లు సంభవిస్తే అప్పటికప్పుడు పరుగులు తీసే కంటే ముందుగానే మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



ద్వారబందం లేని భవనం



పగిలిపోయిన కిటికీ అద్దాలు



భవనం మెట్ల మార్గం వద్ద ఊడిపోయిన గ్రిల్స్

క్లుప్తంగా

ఆదిరెడ్డిపాలెం పాల సొసైటీ అధ్యక్షుడిగా రమణ



పాల సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికైన ఆదిరెడ్డి రమణను అభినందిస్తున్న పాలకవర్గ సభ్యులు

సబ్బవరం: ఆదిరెడ్డిపాలెంలోని విశాఖ డెయిరీ పాల సొసైటీ నూతన అధ్యక్షుడిగా ఆదిరెడ్డి రమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాల సొసైటీలో గురువారం జరిగిన సర్వసభ్య సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా చిటికిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి కృష్ణ, కామిరెడ్డి లక్ష్మి, కొటాన రాము, ఆదిరెడ్డి పోతుబాబు, బైలపూడి దేముడుబాబు, కొటాన అప్పారావు, కొటాన కోటయ్య, తదితరులు ఎన్నికయ్యారు.

పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం నేడు



పంచముఖ ఆంజనేయస్వామి

పెందుర్తి: చినముషిడివాడలోని కార్యసిద్ధి పంచముఖ వీరాంజనేయ స్వామి ఆలయ 14వ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త శానాపతి శంకరరావు తెలిపారు. ఉదయం 7 గంటలకు సహస్ర నాగ వల్లీ సహిత సింధూరార్చన, 9 గంటలకు విశేష అలంకరణ, అర్చన, 11 గంటలకు నక్షత్ర హారతి, మంత్ర పుష్పం నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భారీ ఎత్తున సమారాధన ఉంటుందని చెప్పారు. భక్తులంతా పూజల్లో పాల్గొని ప్రసాదం స్వీకరించాలని కోరారు.

పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐగా నరసింగరాజు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌ఐ నరసింగరాజు

పెందుర్తి: పెందుర్తి ట్రాఫిక్ విభాగం సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.నరసింగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం నరసింగరాజు పెందుర్తి పీఎస్‌లో బాధ్యతలు స్వీకరించారు. నరసింగరాజు గతంలో ఎయిర్‌పోర్టు, టూ టౌన్, గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌లలో ఎస్‌ఐగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెందుర్తి ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామన్నారు. వాహనచోదకులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని సూచించారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులరెడ్డి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కెరీర్ ఎడ్యుకేషన్‌పై సదస్సు ప్రారంభం

కొమ్మాది : విశాఖ జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న కెరీర్ ఎడ్యుకేషన్ అనే అంశంపై శిక్షణ తరగతులు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా గురువారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని గీతం ప్రో వీసీ వై.గౌతమ్‌రావు, డీఈవో చంద్రకళ ప్రారంభించారు. ఉపాధ్యాయులు, జూనియర్ లెక్చరర్లకు కెరీర్ ఎడ్యుకేషన్‌లోని పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

అప్పన్న స్వామికి ఘనంగా ఆర్జిత సేవలు



స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు



తలంబ్రాలు ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చనను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేసి 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- సింహాద్రి అప్పన్న స్వామికి గురువారం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను బేడా మండపంలో వేదికపై అధిష్టింపజేసి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

తెగిన వలలు, ప్లాస్టిక్ వ్యర్థాలతో తీవ్ర నష్టం



అవగాహన ర్యాలీలో మత్స్యకారులు

భీమునిపట్నం : సముద్ర జలాల్లో తెగిన వలలు, ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల జీవాలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని భారతీయ మత్స్య పరిశోధన సంస్థ విశాఖ శాఖ మెరైన్ ఇంజినీర్ డి.బామిరెడ్డి అన్నారు. బీచ్‌రోడ్డులోని చేపలుప్పాడ వద్దనున్న మత్స్యశాఖ అభివృద్ధి కార్యాలయంలో గురువారం అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది మత్స్యకారులు చేపల వేటకు వెళ్లే సమయాల్లో దెబ్బతిన్న వలలను సముద్రంలో వదలకూడదని, అలాగే తీరంలో ఉండే వారు ప్లాస్టిక్ వ్యర్థాలను సముద్రంలోకి పడేయకూడదని సూచించారు. వీటి వల్ల అనేక అనర్థాలు జరుగుతాయని, వీటిని నివారించాల్సిన బాధ్యత తీర ప్రాంతాల్లో ఉండే అందరిపైనా ఉందన్నారు. బీచ్‌లకు వచ్చే సందర్శకులు కూడా వినియోగించిన ప్లాస్టిక్ సీసాలు, కవర్లను తీరంలో పడేయకుండా చెత్త డబ్బాల్లో వేయాలని సూచించారు. అలాగే తాబేళ్లను వేటాడడం నేరమని, మత్స్యకారులంతా ఈ విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. స్థానిక మత్స్యశాఖ అధికారి డి.లావణ్య మాట్లాడుతూ సముద్రంలో మత్స్య సంపదను పెంచడం కోసం భీమిలి తీరంలో చేపలకు కృత్రిమ ఆవాస కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు.

వేపగుంట-పినగాడి రోడ్డు పనులకు గ్రీన్ సిగ్నల్

- మూడు రోజుల్లో పనులు ప్రారంభించనున్న జీవీఎంసీ



జీవీఎంసీ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పెందుర్తి: జీవీఎంసీ పరిధిలోని వేపగుంట-పినగాడి రోడ్డు పునర్నిర్మాణ పనులు మూడు రోజుల్లో ప్రారంభించనున్నట్టు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు తెలిపారు. ఎన్నికల ముందు టెండర్ ప్రక్రియ పూర్తయిన ఈ రోడ్డు పనులు ఇకపై శరవేగంగా జరుగుతాయని చెప్పారు. గురువారం వేపగుంటలో పర్యటించిన ఎమ్మెల్యే రహదారి నిర్మాణ పనుల ప్రారంభం గురించి జీవీఎంసీ ఉన్నతాధికారులను ఆరా తీశారు. తక్షణమే పనులు ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జీవీఎంసీ పరిధిలోని రోడ్డు పూర్తి చేస్తామని చెప్పారు. తదుపరి పినగాడి వరకు ఉన్న రహదారిని ఆర్ అండ్ బీ అధికారులతో చర్చించి నిర్మాణం చేపడతామని వెల్లడించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వేగవంతంగా రహదారి పనులు చేపడతామని పేర్కొన్నారు. జోనల్ కమిషనర్ హైమావతి, ఇంజినీరింగ్ విభాగం అధికారులు రత్నాకర్, విజయ్‌కుమార్, కాంట్రాక్టర్ అప్పలనాయుడు, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, నాయకులు పిల్లా జగన్‌మోహన్‌పాత్రుడు, అయిత సింహాచలం పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



పీఆర్‌వో నాయుడికి చెక్కు అందజేస్తున్న దాత నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గురువారం పీఎం పాలేనికి చెందిన బలిజి నాగేశ్వరరావు లక్ష రూపాయల విరాళం అందజేశారు. సింహగిరిపై విచారణ కార్యాలయంలో సంబంధిత చెక్కుని దేవస్థానం పీఆర్‌వో నాయుడికి అందజేశారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఉద్యోగి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్గు తాగుతూ చిన్నారి మృతి



చిన్నారి వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు, కుటుంబీకులు



చిన్నారి దాన్విక

కొమ్మాది : ఉగ్గు తాగుతూ చిన్నారి మృతి చెందిన సంఘటన బీచ్ రోడ్డులో చోటు చేసుకుంది. జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేటకు చెందిన వాసుపల్లి వంశీ, ప్రవళికల ఏడాదిన్నర వయసు గల రెండో కుమార్తె దాన్విక (ధన) వారం రోజుల నుంచి దగ్గుతో బాధపడుతోంది. ఆ చిన్నారికి గురువారం ఉదయం ఉగ్గు పడుతుండగా ఒక్కసారిగా పాప చేతులు, కాళ్లు బిగించుకుని బిగ్గరగా అరిచింది. గమనించిన తల్లిదండ్రులు వెంటనే భీమిలిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అల్లారు ముద్దుగా చూసుకుంటున్న కుమార్తె హఠాత్తుగా చనిపోవడంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు అందరినీ కలచివేసింది.

సెయిల్‌లో విలీనంతో 'ఉక్కు'కు పూర్వవైభవం



మాట్లాడుతున్న ఉక్కు పోరాట కమిటీ నాయకుడు శ్రీనివాసరావు

అగనంపూడి: విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయగలిగితే పునరుజ్జీవం పొంది, పూర్వ వైభవాన్ని సంతరించుకోగలదని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలేదీక్షలు గురువారానికి 1232వ రోజుకు చేరుకున్నాయి. శిబిరంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రిపై ఒత్తిడి పెంచడానికి అఖిలపక్ష నాయకులతో సమావేశం ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవ తీసుకోవాలని కోరారు. వీరిద్దరూ తలచుకుంటే ఉక్కు ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగడంతో పాటు పూర్వవైభవం ఉక్కుకు రాగలదన్నారు. నాలుగు దశాబ్దాల పాటు ఎన్నో అవరోధాలు, ఆటంకాలను దాటుకుని ఉక్కు పరిశ్రమను విస్తరించుకుంటే పారిశ్రామికవేత్తల ఆకలిని తీర్చడానికి విశాఖ ఉక్కును బలిపశువును చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు జయ, బి.ఎస్.రాజు, డి.సి.హెచ్.వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, అప్పారావు, గోవింద్, రమణ, దాసరి శ్రీను, గంగాధర్, అప్పారావు, అంజి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణానికి ఉద్యమమే శరణ్యం

మాజీ ఎమ్మెల్సీ ఎంవీవీ శర్మ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవీవీ శర్మ

అల్లిపురం: జిల్లా గ్రంథాలయ సంస్థకు చెందిన ఎకరా స్థలంలో గ్రంథాలయ భవన నిర్మాణానికి ఉద్యమమే శరణ్యమని మాజీ ఎమ్మెల్సీ ఎంవీవీ శర్మ స్పష్టం చేశారు. విశాఖ మహానగరంలో విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రజలకు సరైన ప్రభుత్వ గ్రంథాలయం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, రాజకీయ నేతలకు గ్రంథాలయం అవసరం పట్టలేదని ఆయన ఆరోపించారు. డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో పౌరగ్రంథాలయ సేవా సమితి అధ్యక్షుడు బి.ఎల్.నారాయణ అధ్యక్షత జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థకు చెందిన ఎకరా స్థలం నేటికి సీఆర్‌పీఎఫ్ వారి ఆధీనంలో ఉందన్నారు. గ్రంథాలయం పునర్నిర్మాణం కోసం కొత్త ప్రభుత్వం పూనుకోవాలని ఆయన కోరారు. గ్రంథాలయానికి నిధుల కొరత లేదన్నారు. ప్రజలను ముక్కుపిండి ఆస్తిపన్ను వసూలు చేసిందని, అందులో 8 శాతం లైబ్రరీ సెస్ రూ.200 కోట్లకు పైగా జీవీఎంసీ గ్రంథాలయ సంస్థకు బకాయి పడిందన్నారు. అధికారం ఇస్తే గ్రంథాలయ భవన నిర్మాణం చేపడతానని జనసేన అధ్యక్షుడు పవన్ ఇచ్చిన మాట ఇప్పుడు నిలబెట్టుకోవాలన్నారు. లేకపోతే భవనం పునర్నిర్మాణం కోసం ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో గ్రంథాలయ సమితి రిటైర్డ్ కార్యదర్శి కె.త్రిమూర్తులు, కోశాధికారి పి.మల్లేశ్వరరావు, ఏయూ ప్రొఫెసర్ సుబ్బారాయుడు, సీహెచ్‌వీఎల్‌ఎస్ శాస్త్రి, పి.మణి, ఎస్.ప్రకాశరావు, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి వారాహి అమ్మవారి నవరాత్రులు

తగరపువలస : జూలై 6 నుంచి 15 వరకు భీమిలి కీతిన్‌పేటలోని శ్రీవిద్యా శక్తి పీఠంలో వారాహి అమ్మవారి నవరాత్రులు నిర్వహించనున్నట్టు సోమయాజుల కల్యాణ చక్రవర్తి శర్మ తెలిపారు. రోజూ సాయంత్రం 6.30కి వారాహి దేవికి అర్చనలు నిర్వహిస్తామన్నారు. చివరి రోజైన 15న ఉదయం 9 గంటలకు వారాహి హోమం, పూర్ణాహుతి నిర్వహించనున్నామని తెలిపారు. వివరాలకు 89783 73743, 83283 05636లో సంప్రదించాలని కోరారు.

స్టాటస్టిక్స్ విభాగానికి పుస్తకాల బహూకరణ

ఎంవీపీ కాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం స్టాటస్టిక్స్ విభాగానికి పుస్తకాలు, జర్నల్స్‌ను మాజీ ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు బహూకరించారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి సమక్షంలో గురువారం స్టాటస్టిక్స్ విభాగంలో ఈ కార్యక్రమం జరిగింది. గతంలో వర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేసిన ఆచార్య కె.శ్రీనివాసరావు స్టాటస్టిక్స్ విభాగం ద్వారా వర్సిటీకి 40 ఏళ్లు సుదీర్ఘ సేవలు అందించారు. వివిధ హోదాల్లో వర్సిటీ ప్రగతికి కృషి చేశారు. తన పరిశోధనలకు సంబంధించిన పుస్తకాలు, జర్నల్స్ ఆల్బమ్స్‌తో పాటు ప్రముఖ వ్యాసాలతో కూడిన పుస్తకాలు విభాగ లైబ్రరీ ద్వారా విద్యార్థులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో బహూకరించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్, ఆచార్య ఎంవీఆర్ రాజు పాల్గొన్నారు.

లలితా పీఠంలో ఆధ్యాత్మిక కవితా గోష్ఠి



నన్నయ సహస్రాబ్ది సంచికను ఆవిష్కరిస్తున్న సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో జరుగుతున్న గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం రచయిత డి.వి.సూర్యారావు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కవితా గోష్ఠి నిర్వహించారు. 24 మంది కవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుర్తాళం శంకరాచార్యులు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి చేతుల మీదుగా ఆదికవి నన్నయ సహస్రాబ్ది సంచికను ఆవిష్కరించారు. ఈ సభకు ఆచార్య కోలవెన్ను మలయవాసిని అధ్యక్షత వహించారు. కవితా గోష్ఠి అనంతరం కవులను స్వామి వారు సత్కరించారు. అనంతరం అనుగ్రహ భాషణం చేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు భువన విజయం సాహితీ రూపకం ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

'కోర్కెల దినం' విజయవంతం చేయండి

డాబాగార్డెన్స్: మూడోసారి అధికారంలోకి వచ్చిన కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేయడానికి పూనుకుంటుందని, ఈ విధానాలకు అడ్డుకట్ట వేసేందుకు జూలై 10న దేశవ్యాప్తంగా కోర్కెల దినం విజయవంతం చేయాలని సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు పిలుపునిచ్చారు. సిటూ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం లేబర్‌కోడ్స్ అమలు చేసే ఉత్తర్వులు ఇవ్వడానికి సిద్ధపడుతోందన్నారు. కేంద్రం, రాష్ట్రంలోని ఎన్డీఏ ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత కార్మిక ప్రజా వ్యతిరేక చట్టాలు అమలు చేయడానికి తగిన కార్యాచరణ రూపొందిస్తుందన్నారు. పీఎఫ్‌కు సంబంధించి యాజమాన్యం వాటా చెల్లించకపోతే పెనాల్టీతో చెల్లించాలని నిబంధన తొలగించారన్నారు. ఇప్పుడు యాజమాన్యం కార్మికుల ఖాతాలో జమ చేయాల్సిన వాటాను ఎప్పుడైనా కట్టవచ్చని, ఇప్పటి వరకు ఉండే పెనాల్టీ నిబంధనలు ఉన్నా, చాలా కంపెనీలు ఇన్‌టైంలో పీఎఫ్ ఖాతాలో జమచేయడం లేదన్నారు. పూర్తి విచారణ జరిపి నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ ఇవ్వడానికి ఉన్న అవకాశాన్ని కూడా తొలగించారన్నారు. దీని వల్ల పెన్షన్ భవిష్యత్‌లో వస్తుందని గ్యారెంటీ లేదని, 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌ను యజమానులకు ఉండడం వల్ల కార్మికవర్గం తీవ్ర శ్రమదోపిడీకి గురవుతుందన్నారు. తక్షణమే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ప్రైవేటీకరణను, జాతీయ నగదు బదిలీకరణ పథకం ఆపాలని, కనీస వేతనాలు నెలకు రూ.26వేలు చొప్పున నిర్ణయించి అమలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. జూలై 10 దేశవ్యాప్తంగా కోర్కెల దినం జరపాలని పిలుపునిచ్చారు.

గర్భిణులకు ఐరన్ మాత్రలు అందజేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: గర్భిణులకు ఐరన్ మాత్రలు అందజేయాలని, సాధారణ ప్రసవాలు జరిగేలా సిబ్బంది సహకారం అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు కోరారు. గురువారం ఆరిలోవ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆరోగ్య కార్యక్రమాలను, అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్, సెషన్ ప్లానింగ్, లబ్ధిదారుల జాబితాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా డయేరియా పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఆయన ఆదేశించారు. రానున్న వర్షాకాలంలో కీటక జనిత వ్యాధులు రాకుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని డీఎంహెచ్‌వో సూచించారు. ఈ సందర్శనలో డీపీవో ఎస్‌హెచ్‌ఎం శశి భూషణ్, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.